విధులకు గైర్హాజరైతే చర్యలు

- వైద్యారోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్
- మిర్యాలగూడ ఏరియా దవాఖానలో కాన్పుల సంఖ్య తగ్గడంపై సీరియస్

రోగులతో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్

మిర్యాలగూడ, మే 16 : ఏరియా దవాఖానలో వైద్యులు విధులకు గైర్హాజరైతే చట్టపరమైన చర్యలు తప్పవని వైద్యారోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. పట్టణ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి వైద్యులకు, స్టాఫ్ నర్సులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలను విజిలెన్స్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారని, వైద్యులు విధులకు రాకుండా డ్యూటీ సమయంలో సొంత ఆస్పత్రిలో పని చేస్తున్నట్లు విజిలెన్స్ గుర్తిస్తే వారి ఆసుపత్రిని మూసివేయించడంతో పాటు కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆసుపత్రిలో త్వరలోనే బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తామని, కాన్పుల సంఖ్య తగ్గడంపై గైనకాలజిస్టు వైద్యులను వివరణ కోరారు. ఏరియా దవాఖానలో అయిన డెలివరీల సంఖ్యలో 70శాతానికి పైగా సిజేరియన్ ఆపరేషన్లు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. సాధ్యమైనంత వరకు సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలని, రాత్రి సమయంలో ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ఇబ్బందులు కలుగకుండా గైనకాలజిస్టులు అందుబాటులో ఉండాలని, కాన్పుల సంఖ్య ను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగులకు అందించే భోజ నం మెనూను వార్డుల్లో ఏర్పాటు చేయించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి మాతృనాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరద్, ఆర్ఎంఓ రాంబాబు ఉన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో వేసవి శిక్షణ ఉపయుక్తం : ఎంఈఓ శ్రీనయ్య

గుడిపల్లిలో బడిబాటలో హాజరైన ఎంఈఓ శ్రీనయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామగిరి, మే 16 : విద్యారుల నైపుణ్యాభివృద్ధిలో వేసవి శిక్షణ ఎంతో ఉపయుక్తమని గుడిపల్లి మండల ఎంఈఓ సముద్రాల శ్రీనయ్య అన్నారు. గుడిపల్లిలో జడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 1నుంచి 16వరకు విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఇందులో భాగంగా గ్రామంలో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని నల్లగొండ డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎంఆడీ ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి రామకృష్ణతో కలిసి బడిపాట ప్రారంభించి ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణలో 100 మంది విద్యార్థులకు ఆట-పాటలు, డ్యాన్స్, యోగా, మెడిటేషన్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేసవి శిక్షణ క్యాంపు ఇన్‌చార్జి సీహెచ్.వెంకటయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వై.శ్రీనివాస్, సీఆర్పీ బి.కరుణ, టీచర్ జె.స్వప్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య : హెచ్ఎం వెంకటరమణ

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని మండలంలోని దుగినవెల్లి పాఠశాల హెచ్ఎం పి.వెంకటరమణ అన్నారు. గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ పనులు నిర్వహించే కూలీల వద్దకు వెళ్లి బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు మురళయ్య, వెంకట్‌రెడ్డి, వెంకటకృష్ణ, ఏఎంసీ చైర్మన్ సైదమ్మ పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ తయారీతో అదనపు ఆదాయం : వెంకయ్య

అవగాహన కల్పిస్తున్న డీపీఓ వెంకయ్య

మునుగోడు, మే 16 : తడి, పొడి చెత్త సేకరణతో తయారు చేసే వర్మీ కంపోస్ట్‌తో గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయంతో పాటు పలు ఉపయోగాలు ఉంటాయని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, దేవరకొండ డివిజన్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని కచాలపురం గ్రామంలో వర్మీ కంపోస్ట్ తయారీపై మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాల అధికారులు, సిబ్బందికి శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వారు పాల్గొని చెత్తతో ఉపయోగాలు, వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధానాన్ని వారికి వివరించారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, మునుగోడు ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి : కామేశ్వర్

గుర్రంపోడ్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు

గుర్రంపోడ్,మే 16 : ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వనమాల కామేశ్వర్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి పి.మంజులకు సమ్మె నోటీస్ అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పగిడిమర్రి సర్వయ్య, సభ్యులు జోలం యాదయ్య, నరేశ్, కొండయ్య, సైదులు, నర్సింహ పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను సీఐటీయూ సంఘం జిల్లా నాయకులు కొప్పు వెంకన్న, గోగుల ఇద్దయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె.జాని, ఆటో యూనియన్ నాయకులు జలంధర్, లక్ష్మణ్, రాంబాబు, హమాలి నాయకులు సైదులు, వెంకయ్య పాల్గొన్నారు.

ఐద్వా చిట్యాల మాజీ అధ్యక్షురాలు శ్రీవేణి మృతి

చిట్యాల, మే 16 : పట్టణ ఐద్వా మాజీ అధ్యక్షురాలు కొంపెల్లి శ్రీవేణి (48) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, ఐద్వా నాయకులు సంతాపం తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635
దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059
మిర్యాలపేట: 9182777630
భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059
కోదాడ: 9182777630
రామన్నపేట: 9182777638

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

భవిత ఏర్పాటు గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు, మే 16 : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేయనున్న భవిత కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేయనున్న భవిత కేంద్రం స్థలాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలోని ఓ గదిలో భవిత కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించగా, ముందు భాగంలో ఉన్న వరండాకు కూడా గ్రిల్స్ పెట్టించి గదిలా మార్చి అక్కడ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అవసరాలైన ర్యాంప్, టాయిలెట్స్, రెయిలింగ్, తాగునీరు వంటి కనీస అవసరాలు ఏర్పాటు చేయలని, వారికి తగినట్లుగా కత్యాధార పద్ధతిలో బోధన ఉండేలా సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధీలోని అంగడిపేట ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షంతో ధాన్యం తడుస్తుందని, ప్రతి రోజు రెండు, మూడు లారీలను ఏర్పాటు చేసి రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులు నాణ్యత గల ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకు రావాలని కోరారు. కలెక్టర్ వెంట చండూరు ఆర్డీఓ శ్రీదేవి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీశ్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, ఎంఈఓ ఊట్కూరి సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

డీ ఫారెస్ట్ భూముల పరిశీలన

నెల్లికల్‌లో డీ ఫారెస్ట్ భూముల గురించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి జానారెడ్డి

తిరుమలగిరి(సాగర్), మే 16 : తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించిన సందర్భంగా మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో డీ ఫారెస్ట్ భూములను శుక్రవారం మాజీ సీఎల్పీ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 80శాతం సర్వే పూర్తి అయ్యిందని, నెల్లికల్ గ్రామంలోని డీ ఫారెస్ట్ భూముల్లో సర్వే జరుగుతుందన్నారు. భూముల సర్వే త్వరగా పూర్తి చేసి అర్హులైన రైతులకు పట్టాలు అందించాలని మాజీ మంత్రి అధికారులకు సూచించారు. అనంతరం రాజవరం గ్రామంలో గతంలో ఇచ్చిన ఇండ్ల స్థలాలను పరిశీలించారు. అనంతరం మండలంలో భూ సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తాసీల్దార్ అనిల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడెం : జప్తివీరప్పగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పక్కన ఎమ్మెల్సీ శంకర్ నాయక్

మిర్యాలగూడ, మే 16 : రాష్ట్రంలో రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి హాజరై మాట్లాడుతూ రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, మంచి దిగుబడులు సాధించాలని, పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. సాగునీటి సమర్థ వినియోగం, తక్కువ యూరియా వాడకంపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా సంస్థ హెడ్ డాక్టర్ లింగయ్య, కేవీకే శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, జిల్లా ఉద్యానవన అధికారి అనంతరెడ్డి, నరసింహ, హెచ్ఎం అనంతరెడ్డి, మత్స్యశాఖ అధికారి కిశోర్, కృష్ణానాయక్, శ్రీనివాస్‌రావు, చలపతిరావు, జిందా, రాంబాబు, నరసింహ పాల్గొన్నారు.

హాలియా : అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పాల్‌టెక్నిక్ కంపసాగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల బృందం హాజరై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీరమ్య, స్వాతి, మండల వ్యవసాయ అధికారి సరిత, ఏఈఓ నాగయ్య, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలి : సృజన

సమావేశంలో మాట్లాడుతున్న భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన

మిర్యాలగూడ, మే 16 : కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ భారత జాతీయ మహిళా సమాఖ్యవర్గ మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపుచేయడంలో, మహిళలపై దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని మండి పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల పేరుతో సుందరీమణులను పిలిపించి తెలంగాణ ఆడపడుచుల మనోభావాలు దెబ్బతినే విధంగా వరంగల్‌లో కాళ్లు కడిగించడం సరి కాదన్నారు. కార్యక్రమంలో దాసర్ల దుర్గమ్మ, ఎర్రబోతు పద్మ, షమీమ్, శాంతి, ఎండీ సయీద్, ధీరావత్ లింగానాయక్, జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్‌కుమార్, ఎర్ర ప్రమీల, పోలేపల్లి మమత, లింగంపల్లి సైదమ్మ, కోటమ్మ, మచ్చ శైలజ, సైదమ్మ, రజియా, సుశీల, సీత పాల్గొన్నారు.

చోరీలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ రామ్మూర్తి

మాట్లాడుతున్న ఎస్ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి, మే 16 : వేసవిలో చోరీలు జరుగడానికి ఆస్కారం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామ్మూర్తి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగదు, ఆభరణాలు ఎట్టి పరిస్థితుల్లో బీరువాల్లో పెట్టొద్దని సూచించారు. బ్యాంకు లాకర్, ఇతర ప్రదేశాల్లో జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. ప్రస్తుతం పెండ్లిళ్ల సీజన్, వేసవి సెలవులు కావడంతో ఊర్లకు వెళ్లేటప్పుడు ఇంటి పక్కల వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు.

శ్రీనివాస్‌కు ఉత్తమ కథా పురస్కారం

ప్రజాకవి గోరటి వెంకన్న చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

నకిరేకల్, మే 16 : పట్టణానికి చెందిన ప్రముఖ కవి, కథా రచయిత తుల శ్రీనివాస్ రచించిన కొత్తల పండుగ అనే కథకు అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఉత్తమ కథా పురస్కారం అందజేసింది. ఈ మేరకు శుక్రవారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రజా కవి గోరటి వెంకన్న చేతుల మీదుగా శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్లను పూర్తి చేయాలి : సీపీఐ

చిట్యాల, మే 16 : మండలంలోని గుండ్రాంపల్లిలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్లను వెంటనే పూర్తి చేసి, పేదలకు పంచాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుండ్రాంపల్లిలో శుక్రవారం జరిగిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులున్నారు.

అర్థశాస్త్రంపై అవగాహన

రామగిరి, మే 16 : సోషల్ స్టడీస్‌లో అర్థశాస్త్రం ఎంతో ప్రాముఖ్యమైనదని ప్రముఖ అర్థశాస్త్ర విశ్రాంత అధ్యాపకుడు, నల్లగొండ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణలో భాగంగా శుక్రవారం నల్లగొండ సెయింట్ ఆల్ఫోన్స్ హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయులకు అర్థశాస్త్రంపై అవగాహన కల్పించారు. ద్రవ్యం, పుట్టుక, విధులు, ద్రవ్యోల్బం అంటే ఏమిటి? దాన్ని ఎలా కొలుస్తారు అనే అంశాలపై వివరించారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

రామగిరి, మే 16 : ఎంజీయూ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల్లో శుక్రవారం ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మధ్యాహ్నం 1వ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ఉదయం జరిగిన పరీక్షల్లో ఒకరు, మధ్యాహ్నం ఒకరు డిబార్ అయినట్లు సీఓఈ డాక్టర్ ఉపేందర్ రెడ్డి తెలిపారు.

ఎంజీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ

రామగిరి, మే 16 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెంట్‌ను టాస్క్ హైదరాబాద్, ఎడ్యుకేట్ న్యూఢిల్లీ సహకారంతో స్థాపించినట్లు ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 30లక్షల వ్యయంతో దీన్ని స్థాపించినట్లు పేర్కొన్నారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోడపడుతుందని చెప్పారు. అదే విధంగా సెంటర్ ఏర్పాట్లలో కృషి చేసిన ఎంజీయూ ఆడిట్ సెల్ డైరెక్టర్, ప్లేస్‌మెంట్ అధికారి వై.ప్రశాంతిని శుక్రవారం రిజిస్ట్రార్ అల్వాల రవితో కలిసి వీసీ అభినందించారు.

బస్ స్టేషన్లలో ఖాళీ షాపులకు టెండర్లు : ఆర్డీసీ ఆర్ఎం

నల్లగొండ సిటీ, మే 16 : నల్లగొండ రీజియన్ ఆర్టీసీ పరిధిలో పలు బస్ స్టేషన్లలో ఉన్న ఖాళీ స్థలాలు, పక్కా మడిగెలు, క్యాంటిన్, వాహనాల పార్కింగ్, లాజిస్టిక్ సర్వీస్ కోసం కాంట్రాక్టర్ల నియామకానికి, ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలాల్లో నిర్మాణానికి సిద్ధంగా ఉన్న షాపుల కోసం టెండర్ విడుదలైనట్లు ఆర్టీసీ ఆర్ఎం జాని రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా టెండరు ఫామ్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం WWW.tgsrtc. telangana. gov.in ను సందర్శించానిచెప్పారు. ఆన్‌లైన్ టెండర్ కోసం https:// telangana.gov.in ను వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 73828 34223 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యువతి ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తికి జైలు

నల్లగొండ సిటీ, మే 16 : ప్రేమించమని వేధించి యువతి ఆత్మహత్యకు కారకుడైన నిండితుడికి 12 ఏండ్ల 6 నెలల జైలు శిక్ష, రూ.17000 జరిమానా విధిస్తూ కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని అదే మండల కేంద్రానికి చెందిన యువకుడు కొన్ని నెలలుగా ప్రేమించమని వెంటపడుతూ ఆమె ఫోన్ నంబర్ తీసుకొని అసభ్యకరంగా మేసేజ్‌లు పెడుతున్నాడు. ప్రేమించకపోతే చంపుతానంటూ బెదిరింపులకు దిగాడు. ఈ క్రమంలో 2023 ఆగస్టు 9న నిందితుడు మధ్యాహ్న సమయంలో యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లి ప్రేమించమని ఒత్తిడి చేసి చేయి పట్టుకోవడంతో ఆమె కేకలు వేసింది. నిందితుడు పారిపోతుడంగా చుట్టు పక్కల వారు, యువతి తండ్రి గమనించి పట్టుకుని మందలించి వదిలేశారు. ఈ ఘటనతో పరువు పోయిందని, తీవ్ర మనస్తాపానికి గురైన యువతి అదే రోజు సాయంత్రం గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వేధింపులకు గురి చేసిన యువకుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో నేరం రుజువై నిందితుడికి శిక్ష పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో అప్పటి సీఐ వెంకటయ్య, ఎస్ఐ అంతిరెడ్డి, ప్రస్తుత సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ విష్ణుమూర్తి, అదనపు పీపీ జవహర్‌లాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నగేశ్‌ను ఎస్పీ అభినందించారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి : ఎమ్మెల్సీ సత్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చిట్యాల, మే 16 : దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న విదేశీ కుట్రలు, ఉగ్రవాదాని అణచివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లిలో జరిగిన పార్టీ చిట్యాల మండల 7వ మహాసభలో ఆయన పార్టీ జెండాను ఎగుర వేసి మాట్లాడారు. దేశ సమగ్రత, భద్రత విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం సరైనది కాదన్నారు. టెర్రరిజం పేరుతో భారతదేశాన్ని ఇబ్బందులకు గురి చేసే చర్యలను యావత్తు దేశం ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్దె శ్రీనివాస్, గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, మండల కార్యదర్శి ఎండీ అక్బర్, జిల్లా యాదయ్య, ఎస్‌కే షరీఫ్, సీమ అంజయ్య పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

బొక్కమంతల పహాడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నిడమనూరు, మే 16 : నర్సరీల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని డీఆర్డీఓ వై.శేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని బొక్కమంతల పహాడ్ గ్రామంలో నర్సరీ, వర్మీ కంపోస్టు షెడ్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఏడాది రహదారుల వెంట మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను నిర్ధారించుకోవాలని, ఇందిరమ్మ ఇండ్లకు ఎస్‌బీఎం పథకం కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. ఉపాధి హామీలో వేతన కూలీలకు అధిక వేతనాలు లభించేలా ఎక్కువ పనిదినాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బోనగిరి రమేశ్, ఎంపీఓ కేదార్‌నాథ్, ఏపీడీ బాలకృష్ణ, ఏపీఓ కంచుగట్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు జి.లింగయ్య, సత్యనారాయణ, మౌనిక, జానయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విత్తనాలను విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

హాలియాలో ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

హాలియా, మే 16 : విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని లేకుంటే డీలర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ